

మళ్లీ గండి

వంశధార కాలువకు మళ్లీ గండి పడింది. అధికారులు పూడ్చి వేశారు.

- 8లో



ఉద్యమం ఆదర్శనీయం

థర్మల్ ఉద్యమానికి 15 ఏళ్లయ్యాయి. సంస్మరణ సభ నిర్వహించారు.

- 8లో

ఏపీపీఎస్సీ పరీక్షలకు ఏర్పాట్లు

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఏపీపీఎస్సీ) లెక్చరర్ పోస్టులకు నిర్వహించే కంప్యూటర్ ఆధారిత పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు చేసినట్లు జిల్లా రెవెన్యూ అధికారి (డీఆర్ఓ) వెంకటేశ్వరరావు తెలిపారు. జూలై 15 నుంచి 23 వరకు జరిగే ఈ పరీక్షలను ప్రశాంతంగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు అన్ని చర్యలు తీసుకున్నామని చెప్పారు. మొత్తం 743 మంది అభ్యర్థుల కోసం జిల్లాలోని నాలుగు కేంద్రాల్లో ఏర్పాట్లు చేశామన్నారు.

న్యూస్‌రీల్

నిరుద్యోగ భృతి ఇవ్వకుంటే ప్రత్యక్ష ఆందోళనే

శ్రీకాకుళం పాతబస్టాండ్: రాష్ట్రంలో ఉన్న నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి తక్షణమే ఇవ్వాలని ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు మొజ్జాడ యుగంధర్, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు బొత్స సంతోష్, కొన్న శ్రీనివాస్ డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా పరిషత్ కార్యాలయం వద్ద పీజీఆర్ఎస్ ఎదురుగా ధర్నా చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీ నిలబెట్టుకోవాలని, లేదంటే ప్రత్యక్ష ఆందోళన తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ నాయకులు వేణు, వసంతరావు, అన్నాజీ, రామోజీ తదితరులు పాల్గొన్నారు.

జీడిపప్పునకు జాతీయ గౌరవం



జాతీయ అవార్డు అందుకుంటున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): శ్రీకాకుళం జిల్లా ప్రతిష్టను దేశవ్యాప్తంగా చాటుతూ పలాస జీడిపప్పు వన్ డిస్ట్రిక్ట్ వన్ ప్రొడక్ట్ (ఓడీఓపి) కింద ఉత్తమ ఉత్పత్తిగా ఎంపికై జాతీయ స్థాయిలో గొప్ప గౌరవాన్ని సొంతం చేసుకుంది. ఈ అవార్డును ఢిల్లీలో సోమవారం జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అందుకున్నారు. ఈ అవార్డును కేంద్ర పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్, ఢిల్లీ ముఖ్యమంత్రి రేఖ గుప్తా, కేంద్ర వస్త్రోత్పత్తుల శాఖ మంత్రి జితిన్ ప్రసాద్, ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్.సవిత కలిసి కలెక్టర్‌కు ప్రదానం చేశారు. జిల్లా ఉద్యానవన శాఖ అధికారి ప్రసాదరావు కూడా హాజరయ్యారు. ఈ అవార్డు రాష్ట్ర ఉద్యాన రంగానికే మైలురాయిగా నిలుస్తుందని మంత్రి అచ్చెన్నాయుడు ప్రశంసించారు. అనంతరం ఢిల్లీలోనే కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడును కలెక్టర్ కలిశారు.

పాతపట్నం గురుకుల పాఠశాలలో జ్వరాలు

పాతపట్నం: పాతపట్నం ప్రహరాజపాలెంలో ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలలో 22 మంది విద్యార్థినులు జ్వరాల బారిన పడ్డారు. దీంతో గంగువాడ పీహెచ్‌సీ ఆధ్వర్యంలో వైద్యులు పూర్ణిమ వైద్య శిబిరం ఏర్పాటు చేసి వైద్య పరీక్షలను నిర్వహించారు. సోమవారం ఉదయం తహసీల్దార్ ఎస్.ప్రసాదరావు, ఎంపీడీఓ పి.చంద్రకుమారిలు పాఠశాలకు చేరుకుని ఉన్నతాధికారులకు సమాచారం అందించారు. దీంతో సోమవారం జిల్లా వైద్యశాఖాధికారి డాక్టర్ కె.అనిత గురుకుల పాఠశాలకు డీఎంహెచ్ఓ ఉదయం 12 గంటలకు పాఠశాలకు చేరుకుని సాయంత్రం ఆరు గంటల వరకు ఉన్నారు. పాఠశాల పరిసరాలను పరిశీలించి, బైదలాపురం, చాపర, మెళియాపుట్టి, బొంతు పీహెచ్‌సీ వైద్యులతో పాఠశాలలోని 453 మంది విద్యార్థినులకు మలేరియా టెస్టులు చేయించారు. నలుగురిని పాతపట్నం సీహెచ్‌సీకి పంపించారు. మూడు రోజులు వైద్య శిబిరం నిర్వహించాలని సూచించారు.



విద్యార్థినులకు వైద్య పరీక్షలను పరిశీలిస్తున్న డీఎంహెచ్ఓ డాక్టర్ అనిత

చేటు తెచ్చిన మాట



- రౌడీ షీటర్ ఆడియో క్లిప్పుల కలకలం
- రాజకీయ, పోలీసు వర్గాలను కుదిపేసిన వ్యవహారం
- కానిస్టేబుల్ సస్పెన్షన్
- రూరల్ ఎస్‌ఎచ్‌ఓపై శాఖాపరమైన విచారణ

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం:

రౌడీషీటర్ కుంగ్‌ఫు శేఖర్ వ్యవహారం పోలీసు వర్గాలను కుదిపేసింది. వెలుగులోకి వచ్చిన ఆడియో క్లిప్పింగ్‌లు అధికార పార్టీలోనే కాదు పోలీసుల్లో కూడా కలకలం రేపింది. ఈ విషయంలో ఇప్పటికే టూటౌన్ పోలీసు స్టేషన్‌లో పనిచేస్తున్న కానిస్టేబుల్‌ను సస్పెండ్ చేయగా, రూరల్ పోలీసు స్టేషన్ ఎస్‌హెచ్‌ఓపై శాఖా పరమైన విచారణకు ఆదేశించారు. అంతేకాదు స్థానిక కోర్టులో కుంగ్‌ఫు శేఖర్‌కు వచ్చిన బెయిల్‌ను రద్దు చేయాలని కోరుతూ హైకోర్టులో అప్పీలుకు కూడా పోలీసు అధికారులు వెళ్లారు.

అసలేం జరిగిందంటే..

పోలీసులకు వెళ్లిన ఫిర్యాదుల ప్రకారం రాగోలు జెమ్స్‌లో పనిచేస్తున్న వెంకటేష్ అక్కడే పని చేస్తున్న తనను ప్రేమించి, శారీరకంగా వాడుకుని పెళ్లి చేసుకోకుండా మోసం చేశాడని ఒక మహిళ రూరల్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఇదే సమయంలో నగరంలో పీఎన్ కాలనీ సమీపంలో ఉంటున్న రౌడీషీట్ ఉన్న పైల చంద్రశేఖర్ అలియాస్ కుంగ్‌ఫు శేఖర్ జోక్యం చేసుకుని ప్రేమ వివాదంలో చిక్కుకున్న వెంకటేష్‌ను, వారి తండ్రి గోవిందరావును పిలిచి వార్నింగ్ ఇచ్చారు. రూ.లక్షా 50వేలు ఇవ్వాలని లేకుంటే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించాడు. వివిధ సెక్షన్ల కింద కేసు పెట్టి బుక్ చేయిస్తానని బెదిరించాడు. అందుకు ఆ యువకుడు, తండ్రి తొలుత అంగీకరించలేదు. కానీ కొన్ని రోజుల తర్వాత మరో సారి కుంగ్ ఫు శేఖర్ ఫోన్ చేసి బెదిరించాడు. వ్యవహారం సీరియస్‌గా ఉందని, తనకు డబ్బులు ఇవ్వాల్సిందేనని భయపెట్టాడు. లేకపోతే కఠిన సెక్షన్లు పెట్టించి ఇబ్బంది పెడతానని గట్టిగా బెదిరించారు. దీంతో చేసేది లేక వెంకటేష్, అతని తల్లి, మరో దగ్గరి బంధువు వచ్చి కుంగ్ ఫు శేఖర్‌కు రూ.లక్షా 50వేలు ఇచ్చారు. అడిగినంత ఇచ్చినప్పటికీ కూడా మళ్లీ మరికొంత సొమ్ము కావాలని ఫోన్‌లో డిమాండ్ చేశాడు. బెదిరింపులకు సైతం దిగాడు. దీన్ని తట్టుకోలేక బాధితుడు వెంకటేష్ తండ్రి గోవిందరావు శ్రీకాకుళం రూరల్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. నాన్ బెయిలేబుల్ సెక్షన్లు పెట్టారని, అరెస్టు తప్పదని ఆందోళనకు లోనైన రౌడీ షీటర్ కుంగ్ ఫు శేఖర్ తనకున్న పరిచయాలను వాడుకున్నారు. అటు ఎమ్మెల్యేతోను, ఇటు టీడీపీ నాయకుడు చల్లా వాసుతోను ఫోన్‌లో సంప్రదింపులు చేశాడు. అంతేకాకుండా టూటౌన్ కానిస్టేబుల్‌తో కూడా సెక్షన్ల కోసం, స్టేషన్‌లో ఏం జరుగుతుందో ఫోన్‌లోనే తెలుసుకునే ప్రయత్నం చేశాడు. ఎమ్మెల్యేతో జరిపిన సంభాషణను, చల్లా వాసుతో జరిపిన సంభాషణను, టూటౌన్ కానిస్టేబుల్‌తో జరిపిన సంభాషణను రికార్డు చేశారు. ఆ ఆడియో క్లిప్పులు బయటకు వచ్చాయి.



సాక్షిలో ప్రచురితమైన కథనం ఇదే..

బెయిల్ రద్దుకోసం

ఆ ముగ్గురితోను జరిపిన సంభాషణలో అరెస్టు కాకుండా ఎలా తప్పించుకోవాలన్న దానిపై చర్చ జరిగింది. ఆ విషయంలో అటు ఎమ్మెల్యే, ఇటు చల్లా వాసు చేసిన, చేయబోతున్న సాయం కోసం మాట్లాడుకున్నారు. ముఖ్యంగా చల్లా వాసుతో జరిపిన రెండు మూడు సంభాషణల మధ్యలో ఎస్ఐ పేరు ప్రస్తావన తెచ్చారు. అరెస్టు చేయరని, 41 నోటీసు ఇచ్చి వదిలేస్తానని అన్నారని, ఇక ముందు జాగ్రత్తగా ఉండాలని చెప్పారని, అడిగిన కమిట్‌మెంట్ నెరవేర్చాలని, అవసరమైతే ఎస్ఐ దగ్గరికి వెళ్లి ఇచ్చుకోవాలని ఆ ఆడియో క్లిప్పులో ఉంది. ఈ వ్యవహారమంతా టీడీపీలో గబ్బు రేపడమే కాకుండా పోలీసుల్లో కూడా చర్చనీయాంశమైంది. ఆడియో క్లిప్పులు బయటికి రావడంతో పోలీసు అధికారుల దృష్టికి కూడా వెళ్లింది.

దీంతో ప్రాథమిక పరిశీలన చేశాక కుంగ్ ఫు శేఖర్‌తో మాట్లాడిన కానిస్టేబుల్ టూటౌన్‌లో పనిచేస్తున్న త్రినాథరావుగా నిర్ధారించుకుని సస్పెండ్ చేయగా, ఆ ఆడియో సంభాషణలో ప్రస్తావన వచ్చిన మేరకు ఎస్‌హెచ్‌ఓతో పాటు సస్పెన్షన్‌కు గురైన కానిస్టేబుల్‌పై శాఖాపరమైన విచారణకు ఉపక్రమించారు. ఇదే విషయాన్ని సోమవారం విలేకర్ల సమావేశంలో ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి వెల్లడించారు. అంతేకాకుండా ఆ తర్వాత పరిణామాల నేపథ్యంలో కుంగ్ ఫు శేఖర్‌ను అరెస్టు చేసినప్పటికీ వెంటనే బెయిల్ వచ్చింది. ఆ బెయిల్‌ను రద్దు చేసి, రిమాండ్‌కు పంపించేలా కోరుతూ హైకోర్టుకు అప్పీలు చేశామని తెలిపారు.

కూటమి పాలనలో మహిళలకు రక్షణ లేదు



ర్యాలీ చేస్తున్న మహిళలు, మహిళా ప్రజాప్రతినిధులు

- రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని ప్రతి ఒక్కరూ ఖండించాలి
- గూడూరు జెడ్పీ ఛైర్‌పర్సన్‌కు క్షమాపణ చెప్పాలి

నరసన్నపేట: కూటమి ప్రభుత్వంలో మహిళలకు రక్షణ లేకుండా పోయిందని, మహిళా ప్రజాప్రతినిధులపైనే దాడులు చేస్తున్నారని, ఇక సామాన్యుల పరిస్థితి ఏమిటని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ మహిళా విభాగం అధ్యక్షురాలు జీవీ రమణి ప్రశ్నించారు. ఇలాంటి క్రూరమైన ప్రభుత్వాన్ని గతంలో ఎప్పుడూ చూడలేదన్నారు. గూడూరు జెడ్పీ ఛైర్‌పర్సన్ హారికపై కూటమి నాయకులు, కార్యకర్తలు పోలీసుల సమక్షంలో దాడులు చేయడం, ఆమెను తీవ్రంగా అవమానించడాన్ని మహిళలు అందరూ ఖండిస్తున్నారని అన్నారు. పార్టీ ఇచ్చిన పిలుపు మేరకు నియోజకవర్గ కేంద్రం నరసన్నపేటలో సోమవారం సాయంత్రం మహిళలు నిరసన ర్యాలీ చేశారు. వైఎస్సార్ విగ్రహం వద్ద ప్లకార్డులతో ధర్నా నిర్వహించారు.

భేషరతుగా క్షమాపణ చెప్పాలి



గూడూరు జెడ్పీ ఛైర్ పర్సన్‌పై దాడిని ఖండిస్తున్నాం. ఆమెకు కూటమి నాయకులు భేషరతుగా క్షమాపణ చెప్పాలి. మహిళా ప్రజాప్రతినిధులకు రక్షణ కల్పించాలి.

– చింతు అన్నపూర్ణ, జెడ్పీటీసీ, నరసన్నపేట

ఈ సందర్భంగా జీవీ రమణి మాట్లాడుతూ ఇంకెన్నాళ్లు రెడ్‌బుక్ రాజ్యాంగం.. ఇంకా కూటమి దాహం తీరలేదా అని ప్రశ్నించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఇలా దాడులు జరుగుతుంటే హోం మంత్రి ఏం చేస్తున్నారు అని మండిపడ్డారు. కార్యక్రమంలో నరసన్నపేట, సారవకోట జెడ్పీటీసీలు చింతు అన్నపూర్ణ, వరుదు నాగేశ్వరమ్మ, పోలాకి ఎంపీపీ ముద్దాడ దమయంతి, పొందర కార్పొరేషన్ మాజీ ఛైర్‌పర్సన్ రాజాపు హైమావతి, ఎంఎంఎస్ మాజీ అధ్యక్షురాలు చింతు శ్రీదేవి, బొరిగివలస సర్పంచ్ బగ్గు జగదీశ్వరి, సవర శైలజ ఎం. సుధ, ఉమ పాల్గొన్నారు.

నిందితులను అరెస్టు చేయాలి



మహిళలు, మహిళా ప్రజాప్రతినిధులపై జరుగుతున్న దాడులు వెంటనే ఆపాలి. దాడికి దిగిన వారిపై కాకుండా హారిక బంధువులపై కేసులు పెట్టడం శోచనీయం. నిందితులను వెంటనే అరెస్టు చేయాలి.

– వరుదు నాగేశ్వరమ్మ, జెడ్పీటీసీ, సారవకోట

ప్రతి ఒక్కరూ ఖండించాలి



కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టాక మహిళలకు రక్షణ లేకుండా పోయింది. ఒక జిల్లా జెడ్పీ ఛైర్‌పర్సన్‌పై పోలీసుల సమక్షంలో దాడి జరగడం కంటే ఘోరం ఇంకేం ఉంటుంది.

– ముద్దాడ దమయంతి, ఎంపీపీ, పోలాకి

భూమి దేవుడిది.. హక్కు నాయకుడిది





దేవుడి భూములను చదును చేసేందుకు ఎక్కడికక్కడ మట్టి వేసిన దృశ్యం

- తోటాడ రెవెన్యూ పరిధిలో బరితెగించిన పచ్చముఠా
- ఎమ్మెల్యే అండతో చెలరేగిపోతున్న అనుచరులు
- జగన్నాథ స్వామి దేవస్థానం భూములు కొట్టేసేందుకు అడుగులు
- ఇప్పటికే చాలావరకు అన్యాక్రాంతమైన భూములు
- ఆక్రమణలు అడ్డుకుని, దేవుడు భూములు కాపాడాలని గ్రీవెన్స్‌లో వైఎస్సార్‌సీపీ నేత చింతాడ రవికుమార్ ఫిర్యాదు

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం:

జగన్నాథ స్వామి దేవుడి భూములపై టీడీపీ నేతల కన్ను పడింది. ఆక్రమించి, ప్లాట్ల విక్రయానికి పచ్చ ముఠా బరితెగించింది. ఎమ్మెల్యేకు కావల్సిన వ్యక్తులే కబ్జాకు దిగారు. ఆయన అండతోనా, సహకారంతోనా తెలీదు గానీ దాదాపు రూ.100కోట్ల విలువైన 10ఎకరాల భూమిని కాజేసేందుకు జోరుగా అడుగులు పడుతున్నాయి. మొత్తానికి జగన్నాథ స్వామి భూములు అన్యాక్రాంతమవుతున్నాయి. కళ్ల ముందే కబ్జా కార్యక్రమాలు జరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. దీనిపై ఆమదాలవలస వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త చింతాడ రవికుమార్ సోమవారం జరిగిన గ్రీవెన్స్‌లో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్‌కు ఫిర్యాదు చేశారు. తక్షణమే జోక్యం చేసుకుని, క్షేత్ర స్థాయిలో విచారణ జరిపి కోట్లాది రూపాయల విలువైన భూమిని కాపాడాలని కోరారు.



తోటాడలోని జగన్నాథ స్వామి దేవస్థానం భూముల్లో రోడ్డు వేసిన దృశ్యం

మిగులు భూముల కబ్జా..

బొందిలీపురం జగన్నాథ స్వామి దేవస్థానానికి సంబంధించి ఆమదాలవలస మండలం తోటాడ రెవెన్యూ పరిధిలో గల సర్వే నంబర్ 121లో దాదాపు 199ఎకరాల భూములుండేవి. ఆ భూముల్ని దశల వారీగా కొందరు ఆక్రమించి, వేరే ప్రాంతాలు, పక్క సర్వే నంబర్లతో తప్పుడు రిజిస్ట్రేషన్లు కూడా చేయించేసుకున్నారు. ఆ భూముల్లో భారీ భవనాల నిర్మాణాలు చేసేశారు. చాలావరకు భూములు అన్యాక్రాంతమైపోయాయి. మిగిలిన భూములను కాజేసేందుకు ప్రస్తుతం అడుగులు పడుతున్నాయి. టీడీపీ అధికారంలోకి వచ్చాక కబ్జాదారులు జోరు పెంచారు. మనల్ని ఎవ్వరూ అడిగేది అన్నట్టుగా దౌర్జన్యంగా ముందుకు సాగిపోతున్నారు. దాదాపు 10 ఎకరాల దేవస్థానం భూములను చదును చేసి, రోడ్లు వేస్తుండటమే కాకుండా విక్రయాలకు ఉపక్రమించారు. రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో తమకున్న లాలూచీ సిబ్బందితో రిజిస్ట్రేషన్లకు కూడా సిద్ధమవుతున్నారు.


గ్రీవెన్స్‌లో ఫిర్యాదు..

తోటాడ రెవెన్యూ పరిధిలోని జగన్నాథ స్వామి దేవస్థానం భూములు ఆక్రమణ, అక్రమంగా రోడ్లు, ప్లాట్లు వేసి విక్రయాలకు సిద్ధమవుతుండటంపై వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త చింతాడ రవికుమార్ వెంటనే అప్రమత్తమయ్యారు. జరిగినదంతా లిఖితపూర్వకంగా గ్రీవెన్స్‌లో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్‌కు ఫిర్యాదు చేశారు. తక్షణమే విచారణ జరిపి, కబ్జాను అడ్డుకోవాలని, దేవుడు భూములు అన్యాక్రాంతం కాకుండా చూడాలని కోరారు.

ఎమ్మెల్యే అనుచరుల పన్నాగం..

ఎమ్మెల్యే అనుచరులుగా చెప్పుకునే ఆనందరావు, శ్యామలరావు, గణపతి, బాలరాజు, కృష్ణారావు, నారాయణరావు తదితర వ్యక్తులు కీలకంగా వ్యవహరిస్తూ, ఓ పూజారి సాయంతో కబ్జాకు దిగినట్టు తెలుస్తోంది. కీలక నేత అండ ఉండటంతో ఏ అధికారి అడ్డుకోరని పట్ట పగలు అక్కడ చదును చేయడమే కాకుండా రోడ్డు కూడా వేసేస్తున్నారు. ప్లాట్ల విభజన చేసి విక్రయాలకు ఉపక్రమించారు. దాదాపు 10 ఎకరాల ఆక్రమణకు ప్లాన్ చేశారు. దీని విలువ రూ.100కోట్ల వరకు ఉండవచ్చు. ఒక దెబ్బతో కోట్లు కొల్లగొట్ట వచ్చని భారీ భూకబ్జాకు దిగారు. తరుచూ ఆక్రమణలతో వివాదాస్పదమవుతున్న జగన్నాథ స్వామి దేవస్థానం భూములను ఇప్పుడైనా కాపాడుకోకపోతే మొత్తం కనుమరుగు అయ్యే పరిస్థితి నెలకొంది.

కుటుంబ కలహాలే నేపథ్యం..



సత్తారు గోపి హత్యపై ఎస్పీ వివరణ

- గ్రూపుల మధ్య జరిగిన హత్య కాదు
- భార్యాభర్తల తగాదాలో జరిగిన హత్యగానే భావిస్తున్నాం
- ఫరీదుపేటలో వైఎస్సార్‌సీపీ నాయకుడి హత్య ఘటనపై వివరాలు వెల్లడించిన ఎస్పీ మహేశ్వర రెడ్డి
- పత్రికల్లో వార్తలపై ఎస్పీ అసహనం

శ్రీకాకుళం క్రైమ్ : ఎచ్చెర్ల మండలం ఫరీదుపేటలో వైఎస్సార్‌సీపీ కార్యకర్త సత్తారు గోపి హత్య రెండు గ్రూపుల మధ్య జరిగిన హత్య కాదని, కేవలం భార్యాభర్తల తగాదాలో జరిగిన ఘటనగానే ప్రాథమిక విచారణలో భాగంగా భావిస్తున్నామని ఎస్పీ కేవీ మహేశ్వర రెడ్డి వెల్లడించారు. జిల్లా వ్యాప్తంగా సంచలనం రేకెత్తించిన ఈ ఘటనపై ఆయన సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు.

ఇప్పటివరకు తాము చేసిన విచారణ, దొరికిన ఆధారాల ప్రకారం భార్యాభర్తల తగాదా పంచాయతీ చేయడానికి రెండువైపులా రెండు గ్రూపుల వారు ప్రయత్నించారని, అందులో భర్త తరఫు ఉన్న వ్యక్తి లోకల్ ఎంపీపీ మొదలవలస చిరంజీవి వద్ద పనిచేస్తున్నారని తెలిపారు. ఈ రెండు గ్రూపుల మధ్య జరిగిన గొడవ వల్లే హత్య జరిగిందని పేర్కొన్నారు. ఈ రెండు గ్రూపుల మధ్య తగాదాలు ఉండొచ్చని, కానీ ఈ ఘటనకు ఆ తగాదాలు కారణం కాదని స్పష్టం చేశారు. కొన్ని పత్రికల్లో కొన్ని విధాలుగా రాస్తున్నారని, తాము చట్ట ప్రకారం పనిచేస్తున్నామని విలేకరులు అడిగిన ప్రశ్నకు సమాధానంగా చెప్పారు.

ఫరీదుపేట గ్రామంలో 1951 నుంచి డేటా తీస్తే 114 కేసులున్నాయని, హతుడిపై కూడా పది కేసులు, ఓ రౌడీషీట్ ఉందని తెలిపారు. ప్రత్యక్ష సాక్షి చెప్పిన దానికి, పోలీసు ప్రకటనకు తేడా ఉందని ఓ విలేకరి ప్రశ్నించగా.. ఘటనకు పాల్పడిందని ఆ గ్రామానికి చెందిన వారేనని, ఘటన కూడా తగువులో ఉన్న మహిళ తల్లి ఇంటి వద్ద జరిగిందని, పంచాయితీ కోసం కాకపోతే అక్కడకు ఎందుకు వెళ్లారని తిరిగి ప్రశ్నించారు. ఘటనా స్థలంలో సీసీ కెమెరా కట్ చేశారని మరో పాత్రికేయుడు చెప్పగా.. సీసీ కెమెరా ఎందుకు పనిచేయలేదో పరిశీలిస్తామన్నారు. భార్యాభర్తల తగువులో 41ఏ నోటీసులు ఇవ్వడం సాధారణమని, పోలీసులు తమ డ్యూటీ తాము చేస్తారని మరో ప్రశ్నలకు బదులిస్తూ చెప్పారు.

భార్యాభర్తల తగువులో భర్త టార్గెట్ కదా.. అన్న ప్రశ్నకు ఎస్పీ స్పందిస్తూ రౌడీషీట్లు ఉన్న వారిని పెద్ద మనుషులంటూ పంచాయితీలు ఎలా చేస్తారని అన్నారు. చనిపోయిన వ్యక్తిపై రౌడీషీట్ ఉందని అన్నారు. గ్రామంపై తాము నిఘా పెట్టడం వల్లే ఏడాదిగా ఎలాంటి ఘటన జరగలేదని చెప్పారు. ఎప్పటి నుంచో గ్రామాన్ని అతిసమస్యాత్మక గ్రామంగా చూస్తున్నామని, పీడీ యాక్టులు నమోదు చేస్తామని, అవసరమైతే కోర్టు అనుమతులు తీసుకుని తదుపరి చర్యలు తీసుకుంటామని తెలిపారు. కొత్త ప్రభుత్వం వచ్చాక ఇలాంటి ఘటనలు జరగడం లేదని, ఎప్పటి నుంచో జరుగుతున్నాయని తెలిపారు.



గోపి మృతదేహం (ఫైల్)

అలా తేల్చేయడం ఏకపక్షం..



ఎస్పీకి వినతిపత్రం అందజేస్తున్న ధర్మాన కృష్ణదాస్, వైఎస్సార్ సీపీ నాయకులు

వైఎస్సార్‌సీపీ నేతల ఆక్షేపణ

- ఫరీదుపేట హత్య విచారణ తీరుపై విస్మయం వ్యక్తం చేసిన ధర్మాన కృష్ణదాస్
- భార్యాభర్తల తగువు అని పోలీసులు అనడం రాజకీయమేనని వ్యాఖ్య
- పోలీసు వ్యవస్థ కూడా రెడ్‌బుక్ ప్రకారమే నడుస్తోంది: మాజీ మంత్రి సీదిరి

శ్రీకాకుళం క్రైమ్ : రాష్ట్రవ్యాప్తంగా సంచలనం కలిగించిన ఫరీదుపేట వైఎస్సార్ సీపీ కార్యకర్త సత్తారు గోపి హత్యోదంతాన్ని పోలీసులు పూర్తిగా పక్కదోవ పట్టిస్తున్నారని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్, మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు ఆందోళన వ్యక్తం చేశారు. పూర్తిగా రాజకీయ కోణంలో జరిగిన ఈ హత్యను భార్యాభర్తల తగువులో భాగమని పోలీసులు చెప్పడం కూడా రాజకీయమేనని అన్నారు. పోలీస్ రూల్ బుక్ రాజ్యాంగం ప్రకారం పనిచేయడం లేదని, షాడో ముఖ్యమంత్రి లోకేష్ రెడ్‌బుక్ ప్రకారం నడుస్తోందని దుయ్యబట్టారు. అధికారంలో ఉన్నామని టీడీపీ నాయకులు ఇలా హత్యలు, దాడులు, దౌర్జన్యాలకు పాల్పడితే భవిష్యత్‌లో వారికి ఇబ్బందులు తప్పవని హెచ్చరించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్‌లో ఎస్పీకి ఫిర్యాదు చేసేందుకు కృష్ణదాస్, సీదిరితో పాటు ఎచ్చెర్ల మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్, ఆమదాలవలస, టెక్కలి వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జులు చింతాడ రవి, పేరాడ తిలక్, నాయకులు బొడ్డేపల్లి రమేష్, ఫరీదుపేట గ్రామస్తులు వచ్చారు. అనంతరం విలేకరుల సమావేశంలో కృష్ణదాస్, సీదిరి అప్పలరాజు మాట్లాడారు.

ఈ సందర్భంగా కృష్ణదాస్ మాట్లాడుతూ.. తమ కార్యకర్త గోపి హత్య చాలా దారుణమని, అతని డ్రైవర్ ప్రసాద్‌ను హత్య చేసినప్పుడు పోలీసులు సరైన చర్యలు తీసుకుని ఉంటే ఇప్పుడీ హత్య జరిగేది కాదన్నారు. పోలీసుల తీరుకు నిరసనగానే బ్లాక్‌షర్ట్ వేసుకుని వచ్చానని, రాష్ట్రమంతా ఇదే దౌర్భాగ్యం నడుస్తోందని, నిన్నటికి నిన్న మహిళా జెడ్పీ ఛైర్‌పర్సన్‌పై సైతం ఇదే తరహాలో దాడి చేయడం దురదృష్టకరమన్నారు. వరుస హత్యలపై వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి చెప్పామని, సత్తారు గోపి కుటుంబానికి అండగా ఉంటామన్నారు.

మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు మాట్లాడుతూ.. ఇదో పైశాచిక హత్య అని, పార్టీలో క్రియాశీలకంగాను, కిరణ్‌కు ఆప్తుడిగాను గోపికి మంచి గుర్తింపు ఉందన్నారు. వారి కుటుంబాన్ని పరామర్శించేందుకు వెళ్లానని, హత్యకు కారణమైన కీలక టీడీపీ నాయకులు గ్రామంలో స్వేచ్ఛగా తిరుగుతున్నారని వారు చెప్పారని, భార్యాభర్తల తగువుని హత్యకు మూలకారణంగా ప్రెస్‌మీట్లు పెట్టి పోలీసులు చెప్పడం సరికాదన్నారు. టీడీపీ ప్రభుత్వం వచ్చిన రెండుమూడు నెలల్లోనే ఫరీదుపేటలో వైఎస్సార్ సీపీ కార్యకర్తను చంపారని, పోలీసులు సరైన చర్యలు తీసుకోకపోవడం వల్లనే మరో హత్య జరిగిందన్నారు.

క్లుప్తంగా

ఎస్పీ గ్రీవెన్సుకు 65 వినతులు

శ్రీకాకుళం క్రైమ్: జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం జరిగిన గ్రీవెన్సులో అర్జీదారుల నుంచి 65 వినతులు అందాయి. ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి ఫిర్యాదులు స్వీకరించారు.

జాతీయ దివ్యాంగ పోటీలకు ఎంపికలు

కాశీబుగ్గ: జిల్లాస్థాయి దివ్యాంగ సబ్ జూనియర్, జూనియర్ పారా అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్–2025 రాష్ట్రస్థాయి క్రీడా పోటీల ఎంపికలు ఈనెల 26వ తేదీన కోడి రామ్మూర్తి క్రీడా మైదానంలో జరగనున్నట్లు అధికారులు తెలియజేశారు. ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాలో ఉన్న ప్రతీ దివ్యాంగ క్రీడాకారులు ఈనెల 24వ తేదీలోగా తమ పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు 93813 68209, 80081 62432, 91776 93836 నంబర్లను సంప్రదించాలని స్టీఫెన్ హాకింగ్ పారా స్పోర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ శ్రీకాకుళం అధ్యక్ష, కార్యదర్శులు తురల్లి రాము, డి.అచ్యుతరావు, కార్య నిర్వాహక సభ్యులు ఎన్.స్రవంతి, ఎన్.మోహన్‌రావు, గణపతి, నీలం తదితరులు కోరారు.

ఉర్లాం స్కూల్‌లో చోరీ

నరసన్నపేట: మండలంలోని ఉర్లాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. సుమారు రూ.40 వేలు విలువ కలిగిన పరికరాలు చోరీకి గురయ్యాయని హెచ్ఎం భారతి సోమవారం తెలిపారు. మరుగుదొడ్లలో ఉన్న విలువైన స్టీల్ ట్యాప్‌లు, ఇతర పరికరాలు చోరీ చేశారన్నారు. శని, ఆదివారాలు వరుసగా స్కూల్‌కు సెలవులు కావడంతో గుర్తు తెలియన వ్యక్తులు తాళాలు విరగ్గొట్టి చోరీకి పాల్పడ్డారు. ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు చేశారు. నాడు–నేడు పథకంలో భాగంగా ఈ పాఠశాలలో అత్యుత్తమ సదుపాయాలు కల్పించారు.

కారు ఢీకొనడంతో వ్యక్తి మృతి


మరణించిన వృద్ధుడు

శ్రీకాకుళం క్రైమ్: జిల్లా కేంద్రంలోని ఏ–1 హోటల్ సమీపంలో(బాలాజీ మెడికల్ షాపు ఎదురుగా) ఆదివారం రాత్రి రోడ్డుపక్కన పడుకున్న గుర్తు తెలియని వృద్ధుడిపై కారు ఎక్కించడంతో మృతి చెందాడని ట్రాఫిక్ ఎస్ఐ మెట్ట మధు పేర్కొన్నారు. సోమవారం ఈ మేరకు వివరాలు తెలిపారు. ప్రత్యక్ష సాక్షి, సీసీ ఫుటేజీ ఆధారంగా ఏపీ39ఎస్‌డబ్ల్యూ6607 నంబర్ కలిగిన కారు పాతపట్నానికి చెందిన ఎం.గణేశ్వరరావుగా గుర్తించడమే కాకుండా, ఆయనే డ్రైవింగ్ చేసినట్లు గుర్తించామన్నారు. మృతి చెందిన వృద్ధుని వయస్సు 65 ఏళ్లుంటుందని, రోడ్లుపై యాచక వృత్తి చేసుకుంటున్నట్లు తమకు తెలిసిందన్నారు. వృద్ధుడి ఆచూకీ తెలిసినవారు 96946 94956, 63099 90809 నంబర్లను సంప్రదించాలన్నారు.

18 పశువులు పట్టివేత

రణస్థలం: మండలంలోని జాతీయ రహదారిపై రామతీర్థాలు కూడలి వద్ద వ్యాన్‌లో అక్రమంగా తరలిస్తున్న 18 గేదెలను జేఆర్‌పురం పోలీసులు సోమవారం ఉదయం పట్టుకున్నారు. శ్రీకాకుళం నుంచి విశాఖపట్నం వైపు వెళ్తున్న వ్యానులో తనిఖీలు చేపట్టారు. విజయనగరం జిల్లాలోని గుర్ల మండలంలో ఉన్న గుజ్జంగవలస గోశాలకు పశువులను తరలించారు. జేఆర్‌పురం ఎస్ఐ ఎస్.చిరంజీవి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

రణస్థలం: లావేరు మండలంలోని జాతీయ రహదారి బెజ్జిపురం కూడలి సమీపంలో ఉన్న హైవే విశ్రాంతి భవనంలో బెజ్జిపురం గ్రామానికి చెందిన శివాజీ(54) అనుమానాస్పద స్థితిలో మృతి చెందారు. మృతిపై కుటుంబ సభ్యులు ఆందోళన చేపట్టారు. సంఘటన స్థలాన్ని లావేరు ఏఎస్ఐ భుజంగరావు పరిశీలించి కేసు నమోదు చేశారు. మృతిడికి భార్య సబ్బి ఆదిలక్ష్మి, ఇద్దరు కుమారులు ఉన్నారు.

అర్జీలు పునరావృతం కాకూడదు


జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్‌కు ఫిర్యాదు చేస్తున్న చింతాడ రవికుమార్

- జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్
- మీ కోసంలో 140 అర్జీలు స్వీకరణ

శ్రీకాకుళం పాతబస్టాండ్: అర్జీలు పునరావృతం కాకుండా అధికారులు పరిష్కరించాలని జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ ఆదేశించారు. స్థానిక జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో సోమవారం ఏర్పాటు చేసిన ప్రజా ఫిర్యాదుల నమోదు మరియు పరిష్కార వేదికలో అర్జీదారుల నుంచి అర్జీలు స్వీకరించారు. రెవెన్యూ, పంచాయతీరాజ్, డ్వామా, మహిళా శిశు సంక్షేమం, మున్సిపల్ కార్పొరేషన్, జిల్లా పంచాయతీ, సాంఘిక సంక్షేమ శాఖ, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ, జిల్లా విద్యాశాఖ, సర్వే అండ్ లాండ్ రికార్డులు, వ్యవసాయం, పంచాయతీ రాజ్ ఇంజినీరింగ్ తదితర శాఖల సమస్యలపై 140 అర్జీలు స్వీకరించారు. అర్జీల స్వీకరణలో జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వరరావు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ పద్మావతి, డీఆర్‌డీఏ పీడీ కిరణ్ కుమార్, పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

వినతులు పరిశీలిస్తే...

- డిగ్రీ అడ్మిషన్లు వెంటనే ప్రారంభించాలని, ఆన్‌లైన్‌లో కాకుండా ఆఫ్‌లైన్ ద్వారా అడ్మిషన్లు చేపట్టాలని ఎస్ఎఫ్ఐ ప్రతినిధులు డిమాండ్ చేశారు. డబుల్ మేజర్ విధానాన్ని తీసుకురావాలని, ఇంటర్న్‌షిప్ భారాన్ని తగ్గించాలని కోరారు. ప్రైవేటు కాలేజీలకు కొమ్ముకాస్తున్న ఆర్ఐవోపై చర్యలు తీసుకోవాలన్నారు.
- సమస్యలపై ఫిర్యాదు చేస్తే, అధికార పార్టీ అండతో తనపై దాడికి దిగారని సామాజిక కార్యకర్త నాయుడు గారి రాజశేఖర్ ఫిర్యాదు చేశారు. టీడీపీ కార్యకర్త, మరో ఆరుగురు కలిసి కర్రలతో హత్యాయత్నం చేశారన్నారు. అయితే అక్కడ కొంతమంది అడ్డుకోవడంతో ప్రమాదం తప్పిందని తెలిపారు. బీసీ హాస్టల్, ధర్మ సత్రంలపై తను గతంలో పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదు చేయడం జరిగిందని, దానిపై ఎంక్వైరీ అని పిలిచి దాడి చేశారన్నారు. బీసీ సంక్షేమ అధికారులు టీడీపీ కార్యకర్తలకు సమాచారం ఇచ్చి వారితో దాడి చేయించారని ఆరోపించారు. కరకట్టపై రూ.కోటి నిధులతో నిర్మించిన సీసీ రోడ్డులో ప్రమాణాలు పాటించలేదని ఫిర్యాదు చేసినందుకు బలరాం దాడి చేశాడని తెలిపారు. తనకు రక్షణ కల్పించాలని విన్నవించారు.
- గార మండలంలోని అంపోలు పరిధిలో బరాటం చెరువును సుమారుగా 10 ఎకరాల వరకు సానివాడ, ఆ చెరువు చుట్టు ఉన్న రైతులు ఆక్రమించుకున్నారని, వాటిని తొలగించాలని ఆ గ్రామానికి చెందిన రుప్ప లక్ష్మి కోరారు.
- దివ్యాంగులకు పింఛన్ ఇప్పించాలని పొందూరు మండలం గోకర్ణపల్లి గ్రామానికి చెందిన చౌదరి అసిరినాయుడు కోరారు. తనకు 59 శాతం వికలాంగత ధ్రువపత్రం ఉందని తెలిపారు. అలాగే నరసన్నపేటకు చెందిన సూర ప్రసాద్‌కి 60 శాతం వికలాంగత ఉందని, ఆయన కూడా పింఛను ఇప్పించాలని విన్నవించారు.
- గార మండలంలోని అంపోలు గ్రామానికి చెందిన కురమాన మల్లేశ్వరరావు తన భూమికి అడంగల్, పాస్‌బుక్ మంజూరు చేయాలని పలుమార్లు గ్రీవెన్సుకి వచ్చి ఫిర్యాదు చేసినా ఫలితం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

ఆక్రమణలకు అడ్డుకట్ట వేయాలి

ఆమదాలవలస మండలంలోని తోటాడ గ్రామ పంచాయతీ పరిధిలో 10 ఎకరాల బావాజీ మఠం భూముల ఆక్రమణలకు అడ్డుకట్ట వేయాలని ఆమదాలవలస నియోజకవర్గం వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త చింతాడ రవికుమార్ కోరారు. ఈ మేరకు పీజీఆర్ఎస్‌లో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్‌కు సోమవారం వినతిపత్రం అందజేశారు. అలాగే బొబ్బిలిపేట గ్రామంలో అధికార పార్టీ అండతో చెరువు గట్టు ఆక్రమణ జరిగిందని, వాటిని తక్షణమే తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని విన్నవించారు. గాజులకొల్లివలస గ్రామంలో ప్రాథమిక పాఠశాలను ఎత్తివేయడంతో ఇబ్బందులు పడుతున్నారని, అక్కడ పాత పాఠశాలను పునరుద్ధరించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. అదేవిధంగా పొందూరు మండలంలోని గోకర్ణపల్లి గ్రామంలో గత సంవత్సర కాలంగా మంచానికే పరిమితమైన వ్యక్తికి వికలాంగ పింఛన్ మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఆయనతో పాటు పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

సోంపేట ఉద్యమం ఆదర్శనీయం

- ఉత్తరాంధ్రను అభివృద్ధి చేయాలి
- సినీ దర్శకుడు, నటుడు ఆర్.నారాయణమూర్తి
- చిత్తడి నేలలపై పుస్తకం ఆవిష్కరణ


చిత్తడి నేలలపై పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న నారాయణమూర్తి తదితరులు

సోంపేట: చిత్తడి నేలల సంరక్షణ కోసం సోంపేట థర్మల్ పవర్ ప్లాంట్‌కు వ్యతిరేకంగా ప్రజలు చేసిన ఉద్యమం ఆదర్శనీయమని సినీ నటుడు, దర్శకుడు ఆర్.నారాయణమూర్తి అన్నారు. సోంపేట థర్మల్ ఉద్యమంలో జరిగిన కాల్పుల్లో ముగ్గురు మృతి చెంది 15 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా పర్యావరణ పరిరక్షణ సంఘం అధ్యక్షుడు డాక్టర్ కృష్ణమూర్తి ఆధ్వర్యంలో సంస్మరణ సభ బారువలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా అమరవీరుల స్థూపం వద్ద ఆర్.నారాయణమూర్తి, ఎమ్మెల్యే బి.అశోక్, పర్యావరణ పరిరక్షణ సంఘ అధ్యక్షుడు డాక్టర్ కృష్ణమూర్తి తదితరులు నివాళులర్పించారు. అనంతరం థర్మల్ స్థూపం ఆవరణలో మొక్కలు నాటారు. చిత్తడి నేలల ప్రాశస్త్యం తెలియజేస్తూ పుస్తకాన్ని ఆర్.నారాయణమూర్తి ఆవిష్కరించారు.

ఉత్తరాంధ్ర కోసం ఉద్యమం చేయాలి

ఈ సందర్భంగా ఆర్.నారాయణమూర్తి మాట్లాడుతూ.. ఉత్తరాంధ్ర అన్ని రంగాల్లో వెనుకబడి ఉందన్నారు. ఉత్తరాంధ్రను అభివృద్ధి చేయకపోతే సోంపేట ఉద్యమాన్ని ఆదర్శంగా తీసుకుని, ఉత్తరాంధ్ర అభివృద్ధి కోసం ఇంకో ఉద్యమం చేయాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. పోలవరం ప్రాజెక్టు ఎత్తు 45 అడుగులు తప్పనిసరిగా ఉండాలన్నారు. 45 అడుగుల కంటే తగ్గిస్తే ఎటువంటి ప్రయోజనం ఉండదని పేర్కొన్నారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ ఆలోచనను కేంద్ర ప్రభుత్వం విరమించుకొని, ఆంధ్రుల హక్కును కాపాడాలని కోరారు. విశాఖ రైల్వే జోన్ ప్రకటనలకే పరిమితం అవుతోందని, జోన్ ద్వారా వచ్చే ఆదాయాన్ని ఒడిశా రాష్ట్రానికి కేటాయించడం సరికాదన్నారు. టీడీపీ ప్రభుత్వం జారీ చేసిన 329 జీవో రద్దు చేసి, ఈ ప్రాంతాన్ని సురక్షిత ప్రాంతంగా గుర్తించాలి విన్నవించారు. మానవ హక్కుల సంఘం నాయకుడు వీఎస్ కృష్ణ మాట్లాడుతూ జాతీయ గ్రీన్ ట్రిబ్యునల్ ఇచ్చిన తీర్పును ప్రభుత్వాలు బుట్ట దాఖలు చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఆమదాలవలసలో ఏర్పాటు చేయనున్న థర్మల్ విద్యుత్ కేంద్రం నిర్మాణంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేఖత ఉందని తెలియజేశారు. అక్కడి ప్రజలు సోంపేట ఉద్యమాన్ని ఆదర్శంగా తీసుకుని ఉద్యమం చేపట్టడానికి సిద్ధమవ్వడం జరుగుతోందన్నారు. ఉద్దానం ప్రాంతంలో కార్గో ఎయిర్ పోర్టు ఏర్పాటు చేయడం వలన ఈ ప్రాంతంలోని కిడ్నీవ్యాధులు నయమవుతాయా అని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఉద్యోగ, ఉపాధి పేరిట ప్రజలను మోసం చేసి కార్పొరేట్ కంపెనీలకు పచ్చని భూములు ధారాదత్తం చేసే కుట్రలకు ప్రభుత్వాలు పాల్పడుతున్నాయని ధ్వజమెత్తారు. పాలకులు తీరు మార్చుకుని పర్యావరణాన్ని కాపాడాలని కోరారు.


థర్మల్ స్థూపం వద్ద నివాళులర్పిస్తున్న ఆర్.నారాయణమూర్తి, ఎమ్మెల్యే అశోక్, డాక్టర్ కృష్ణమూర్తి తదితరులు

చిత్తడి నేలలతో మేలు

చిత్తడి నేలలతో పర్యావరణానికి మేలు జరుగుతుందని పర్యావరణ పరిరక్షణ సంఘం అధ్యక్షుడు డాక్టర్ కృష్ణమూర్తి అన్నారు. పర్యావరణం పరంగా చిత్తడి నేలలు గుప్తనిధి వంటివన్నారు. బీల ప్రాంతంలో నివసిస్తున్న జీవరాశులకు పర్యావరణ పరంగా ఓ ప్రత్యేకత ఉందని పేర్కొన్నారు. మానవ శరీరంలో మూత్రపిండాలు ఎటువంటి ముఖ్యపాత్ర పోషిస్తున్నాయో, అలాగే భూమి తల్లికి చిత్తడి నేలలు అటువంటివన్నారు. ఇటువంటి వాటిని కాపాడడానికి ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. మాజీ జెడ్పీటీసీ సూరాడ చంద్రమోహన్ మాట్లాడుతూ బీల ప్రాంతంలో ఎకో టూరిజం ప్రోత్సహించడం ద్వారా ఈ ప్రాంతం అభివృద్ధి చెందుతుందన్నారు. కార్యక్రమంలో బారువ సర్పంచ్ యర్ర రజని, ప్రముఖ కవి జయరాజ్, మానవ హక్కుల సంఘ నాయకులు కేవీ జగన్నాథరావు, మత్స్యకార నాయకులు బడే తమ్మయ్య, బట్టి మాధవరావు, కళాసీ సంఘం అధ్యక్షుడు లోకనాథం, పర్యావరణ నాయకుడు సనపల శ్రీరామమూర్తి, బార్ల సుందరరావు, కూన రాము, బత్తిన లోకనాథం, పాల్గుణరావు, హేమ సుందరరావు, సోమేష్ తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శిపై దాడి

నరసన్నపేట: సారవకోట మండలంలోని బుడితి సచివాలయంలో పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తున్న దొంకాన శ్రీనివాసరావుపై సోమవారం ఉదయం దాడి జరిగింది. స్వగ్రామం జదూరు నుంచి డ్యూటీకి బుడితి వెళ్తుంగా మార్గమధ్యలో రావాడపేట వద్ద జమ్ము గ్రామానికి చెందిన రుప్ప రాజు ఆయనపై దాడిచేసి గాయపరిచారు. అంతకు ముందు ఇద్దరి మధ్య వాగ్వివాదం జరిగింది. అనంతరం శ్రీనివాసరావుపై రాజు దాడి చేశారు. ఘటనపై నరసన్నపేట ఎస్ఐ సీహెచ్ దుర్గాప్రసాద్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఒక వివాహేతర సంబంధం విషయంలో రాజుకి, శ్రీనివాసరావుకు మధ్య గత కొంతకాలంగా గొడవలు జరుగుతున్నట్లు సమాచారం. దీంట్లో భాగంగానే సోమవారం ఇద్దరి మధ్య ఘర్షణ జరిగినట్లు స్థానికులు చెబుతున్నారు.


గాయపడిన పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావు

గొంతు నొక్కి.. కత్తితో బెదిరించి

- వృద్ధురాలి మెడలో చైన్ దొంగిలించిన యువకుడు అరెస్టు
- వివరాలు వెల్లడించిన ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ మహేశ్వర రెడ్డి

శ్రీకాకుళం క్రైమ్: జిల్లా కేంద్రంలోని హయాతీ నగర్ బాలాజీనగర్‌లో ఒక వృద్ధురాలి చెంపపై కొట్టి.. కత్తితో బెదిరించి.. మెడలో చైన్ దొంగిలించి పారిపోయిన యువకుడు జీరు సురేష్‌ను పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. ఈ మేరకు జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి వివరాలు వెల్లడించారు. ఎచ్చెర్ల మండలంలోని కొయ్యం పంచాయతీ కొత్త కూరిమినాయుడుపేట గ్రామానికి చెందిన సురేష్ చెడు వ్యసనాలకు లోనై అప్పులు చేసిమరీ జల్సాలు చేసేవాడు. ఈ క్రమంలో ఈజీగా డబ్బులు సంపాదించాలంటే దొంగతనాలు చేయడమే మార్గమనుకున్నాడు.

నీళ్లు కావాలంటూ వెళ్లి..

ఈనెల 9వ తేదీ రాత్రి 8.30 గంటలకు బాలాజీనగర్‌లో వృద్ధురాలు పొడుగు ఆరుద్రమ్మ ఒక్కరే ఇంట్లో ఉండడం గమనించిన సురేష్ మంచినీళ్లు కావాలంటూ వెళ్లాడు. ఆమె నీరు తీసుకురావడానికి వెళ్తుంటే వెనుకగా వెళ్లడంతో వృద్ధురాలు ప్రశ్నించగా మీ అబ్బాయికి డబ్బులు అప్పిచ్చాను.. అంటూనే వృద్ధురాలి చెంపమీద గట్టిగా కొట్టాడు. అనంతరం మెడను నొక్కిపెట్టి కత్తిని పీకపై పెట్టి చంపుతానని బెదిరించాడు. మెడలో ఉన్న రెండు వరసల బంగారుతాడు బలవంతంగా తెంపి పారిపోయాడు. దీంతో వృద్ధురాలిచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన ఒకటో పట్టణ పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. విచారణలో సురేష్ నిందితుడని పోలీసులు కనిపెట్టి అరెస్టు చేశారు.

ఇదివరకూ కేసులున్నాయి

నిందితుడైన సురేష్ ఈనెల 13వ తేదీ సాయంత్రం 4 గంటలకు వెంకటాపురం సింహద్వారం వద్ద పోలీసులకు చిక్కడంతో ఇదివరకూ కేసులున్నట్లు విచారణలో తెలిసిందన్నారు. ఈ ఏడాది మే నెలలో పీఎస్‌కాలనీలో తన స్నేహితుడితో కలిసి ఎలక్ట్రికల్ సామాన్లు, టీవీ, ల్యాప్‌టాప్, బంగారు నగలు, రూ.50 వేలు నగదు దొంగిలించగా రెండో పట్టణ పోలీసులు అరెస్టు చేశారు. అప్పుడు అంపోలు జైలుకు వెళ్లి బెయిల్‌పై వచ్చిన సురేష్ మళ్లీ చోరీకి పాల్పడటం విశేషం. నిందితుడి వద్ద కేసు ప్రాపర్టీని స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్పీ పేర్కొన్నారు. కేసును ఛేదించిన పోలీసులను అభినందించారు.

దేవుడి మీద కోపంతో..!

- మద్యం మత్తులో విగ్రహాల ధ్వంసానికి పాల్పడిన వ్యక్తి అరెస్టు


వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ మహేశ్వర రెడ్డి

శ్రీకాకుళం క్రైమ్: భార్య మొదటిసారి కాన్పులోనే మగబిడ్డను పోగొట్టుకున్నాడు.. మరోమారు గర్భిణిగా ఉండేటప్పుడే భార్య కడుపులో పిండం పోయింది. ఈ క్రమంలో ఆ వ్యక్తి మద్యానికి బానిసయ్యాడు. విసిగివేసారిన భార్య సైతం తననొదిలేసి పుట్టింటికి వెళ్లిపోయింది. తీవ్ర మనస్తాపానికి గురైన ఆ వ్యక్తి తనకు దేవుడు అన్యాయం చేశాడని, శివుడు అనేవాడే లేడని, సొంత గ్రామంలోనే ఉన్న నవగ్రహ ఆలయంలోని విగ్రహాలను ధ్వంసం చేసేశాడు. జిల్లాలోని జి.సిగడాం మండలం దాలంరాజువలస గ్రామంలో ఈనెల 11న జరిగిన ఈ ఘటనకు సంబంధించి నిందితుడు వేముల రామకృష్ణ సోమవారం పోలీసులకు పట్టుబడ్డాడు. జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి ఈ మేరకు విలేకరుల సమావేశం నిర్వహించారు.

గ్రామస్తుల సమాచారంతోనే..

దాలంరాజువలస గ్రామంలో శివాలయం పక్కనే ఉన్న నవగ్రహ విగ్రహాలను ఈనెల 11వ తేదీన రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు విరగ్గొట్టారని ఇచ్చిన ఫిర్యాదు మేరకు జి.సిగడాం పోలీసులు ప్రత్యేక బృందాల సాయంతో దర్యాప్తు చేపట్టారు. గ్రామస్తుల సమాచారంతో రామకృష్ణను అనుమానితుడిగా భావించిన పోలీసులు ఆధారాలు సేకరించారు. 1999లో రామకృష్ణకు వివాహమైందని, భార్య 2022లో విడిచిపెట్టి పుట్టింటికి వెళ్లిపోయిందని తెలుసుకుని కారణాలపై ఆరా తీశారు.

మద్యం సీసానే పట్టించింది

ఈనెల 11వ తేదీన ఉదయం కార్పెంటర్ నారాయణ పని ఉందని రమ్మని చెప్పి రామకృష్ణకు రూ.300లు ఇచ్చాడు. అదేరోజు రాత్రి 7.10 గంటలకు సర్వేశ్వరం గ్రామ కూడలిలో ఉన్న మద్యం షాపునకు రామకృష్ణ వెళ్లి రెండు క్వార్టర్ల మద్యం బాటిళ్లు కొన్నాడు. అందులో ఒకటిన్నర బాటిల్ తాగి రాత్రి 10 గంటలకు శివాలయం వద్దకు పడుకోవడానికి వెళ్లాడు. మిగిలిన హాఫ్ క్వార్టర్ బాటిల్ మద్యం తాగేందుకు నవ గ్రహాలయం పక్కన ఉన్న వాటర్ ట్యాప్ నుంచి వాటర్ పట్టుకున్నాడు. అనంతరం మద్యం మత్తులో పక్కనే ఉన్న ఇనుప రాడ్డు తీసుకుని ఆలయం లోపలికి ప్రవేశించాడు. శని దేవుడు శని పట్టుకోవడం వలనే జీవితం పోయిందని అక్కడ ఉన్న తొమ్మిది విగ్రహాలను ఇనుప రాడ్డుతో విరగ్గొట్టాడు. మిగిలిన హాఫ్ మందు తాగి శివాలయంలోనే పడుకుని ఉదయం 5 గంటలకు లేచి ఎదురుగా ఉన్న పొదల్లో బాటిల్‌ను పడేసి, ఇనుప రాడ్డును దూరంగా ఉన్నపొదల్లో దాచాడు. పోలీసులకు దొరికిన ఆ బాటిల్ సర్వేశ్వరం జంక్షన్‌లో ఉన్న మద్యం షాపులోనే దొరుకుతుందని అక్కడికి వెళ్లి సీసీ ఫుటేజీ వెరిఫై చేసి ఆరా తీయడం, బాటిల్‌పై ఫింగర్ ప్రింట్స్ బట్టి నిందితుడు రామకృష్ణ అనే నిర్ధారణకొచ్చారు. 2022లో అదే గుడిలో పూజారి అయ్యప్ప మాల వేసిన సమయంలో దేవుని పటాలను పగలగొట్టడంతో రామకృష్ణపై కేసు ఉందన్నారు. రామకృష్ణ, పూజారి ఇద్దరూ కలిసి మద్యం సేవించే సందర్భాలు అనేకమని, కాకపోతే ఈ కేసులో పూజారి పాత్ర లేదని ఎస్పీ స్పష్టం చేశారు.

ఎరువుల షాపు సీజ్


ఎరువుల షాపులో తనిఖీలు చేస్తున్న అధికారులు

శ్రీకాకుళం రూరల్: ఎటువంటి పత్రాలు లేకుండా ఎరువులు అమ్ముతున్న ఒక షాపును విజిలెన్స్, వ్యవసాయ శాఖ అధికారులు మూకుమ్మడిగా దాడులు చేసి సీజ్ చేశారు. మండల పరిధిలోని సింగుపురం గ్రామంలో ఉన్న గౌతమ్ ట్రేడర్స్ హోల్‌సేల్ ఎరువుల షాపులో సోమవారం రాత్రి తనిఖీలు చేయగా కిబ్కో కంపెనీకు చెందిన ఎరువులు డీఏపీ, యూరియా సంబంధిత కంపెనీలకు చెందిన ఓఫారం లేకుండా గడిచిన రెండు రోజులుగా అమ్ముతున్నట్లు విజిలెన్స్ అధికారులు గుర్తించారు. వీటితో పాటు సింగిల్ సూపర్ ఫాస్పేట్ గ్రీన్‌స్టార్ కంపెనీకు చెందిన 10 టన్నుల ఎరువులను స్టాక్ బుక్‌లో నమోదు చేయకుండా డీలర్లకు ఆ షాపు యజమాని అమ్ముతున్నట్లు గుర్తించారు. దీంతో సంబంధింత షాపును విజిలెన్స్ అధికారులు 15 రోజులు పాటు సీజ్ చేసినట్లు తెలిపారు. అలాగే షాపులో ఉన్న 71.02 మెట్రిక్ టన్నుల ఎరువుల అమ్మకాన్ని పూర్తిగా నిలుపుదల చేసినట్లు నోటీసులు అందజేశారు. ఈ తనిఖీల్లో స్క్వాడ్ టీమ్‌తో పాటు వ్యవసాయ సహాయ సంచాలకులు బి.విజయ్‌ప్రసాద్, సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ విజిలెన్స్ ఆడారి సంతోష్ మండల వ్యవసాయాధికారి నవీన్ తదితరులు పాల్గొన్నారు.

వంశధార కాలువకు మళ్లీ గండి

- ఆందోళనలో రైతులు


హిరమండలం వంశధార ఎడమ ప్రధాన కాలువకు గండిపడి పొలాల్లోకి ప్రవహిస్తున్న నీరు

హిరమండలం: వంశధార ఎడమ ప్రధాన కాలువకు మరోసారి గండి పడింది. ఈ నెల 2న గొట్టా బ్యారేజీ నుంచి నీటిని విడుదల చేశారు. అందులో భాగంగా ఎడమ ప్రధాన కాలువ నుంచి నీటిని విడుదల చేయగా.. రెండు రోజులకే మజ్జిగూడాం సమీపంలో గండి పడింది. దీంతో అప్పటికప్పుడు గేట్లు మూసి వేసి గండిని పూడ్చారు. అప్పటి నుంచి ఎడమ ప్రధాన కాలువలో సుమారు 1350 క్యూసెక్కుల నీరు ఎడమ ప్రధాన కాలువాలో ప్రవహిస్తోంది. అయితే మళ్లీ సోమవారం 5.02 కిలోమీటర్ 5ఏఆర్ ఓటీ స్లూయిజ్ (మదుము) వద్ద మరోసారి గండి పడింది. దీంతో కాలువలో నీరు పొలాల్లోకి చేరడంతో రైతులు అధికారులకు సమాచారం అందించారు. దీంతో వారు ఎడమ ప్రధాన కాలువలోకి నీటిని వెళ్లకుండా నిలిపివేశారు. నరసన్నపేట ఈఈ మురళీమోహన్, డీఈ శ్రీనివాసరావు, గొట్టాబ్యారేజీ డీఈ సరస్వతి గండి పడిన ప్రాంతాన్ని పరిశీలించి గండిని పూడ్చివేశారు. అనంతరం కాలువలోకి 500 క్యూసెక్కుల నీటిని విడిచిపెట్టారు. ఈ సందర్భంగా ఈఈ మురళీమోహన్ మాట్లాడుతూ కాలువలు నిర్మించి యాభై ఏళ్లు దాటాయని, రాతికట్టు కావడంతో రాయి మధ్యలో ఇసుక ఊడి గండిపడినట్లు తెలిపారు. నీరు విడిచిపెట్టిన 12 రోజులకే రెండుసార్లు గండిపడడంపై రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వానలు పడి కాస్త ఎక్కువ నీరు విడిచిపెడితే పరిస్థితి ఏంటని ప్రశ్నిస్తున్నారు. గతంలో నీటిని విడిచిపెట్టే సమయానికి కాలువలో జంగిల్ క్లియరెన్స్ పనులతో పాటు గట్టు పటిష్టం చేసేవారని, కానీ ఈ ఏడాది గట్టు పటిష్టం వంటి పనులు సరిగా జరిగినట్టు లేవని తెలిపారు.